నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, గురువారం 26 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రి జూపల్లి, చిన్నారెడ్డి, మల్లురవి, జితేందర్‌రెడ్డి

ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

- పెండింగ్ పనులకు రూ.50 వేల కోట్లు
- ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్య శ్యామలంగా మారుస్తాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- ప్రతి ఎకరాకూ సాగునీళ్లిస్తాం : మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ప్రాజెక్టుల పూర్తికి కట్టుబడి ఉన్నామని, రూ.50వేల కోట్లతో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అంజనగిరి రిజర్వాయర్‌ను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి మంత్రులు పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రాజెక్టు పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ గతంలో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు దృఢ సంకల్పంతో మంత్రుల బృందం అడుగులు వేస్తుందన్నారు. ఉమ్మడి పాల మూరు జిల్లాలోని పీఆర్ఎల్ఐ, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, గట్టు ప్రాజెక్టుల పురోగతిలో ఉన్న, పెండింగ్ పనులను నూటికి నూరు శాతం పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. సీఎం రేవంత్ సొంత జిల్లా పాలమూరులో సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉదండాపూర్‌లో భూసేకరణ పరిహారం ఆరేడు నెలల్లో ఇస్తామన్నారు. నార్లాపూర్‌లో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాల్వల టెండర్లను త్వరలో చేపడుతామని ప్రకటించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ సీఎం సొంత జిల్లా కావడంతో ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల పూర్తికి మంత్రి ఉత్తమ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఎకరాకూ నీళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భూసేకరణలో నిర్వాసితులకు పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తామన్నారు. రూ.50 వేల కోట్లతో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. ప్రతి రెండు నెలల కనీసారి సమీక్షలు నిర్వహించి పాలమూరులోని ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. వచ్చే మూడు, నాలుగేండ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, విజయుడు, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అధికారులు ఉన్నారు.

ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో వాగ్వాదానికి దిగిన భూనిర్వాసితులు

నిర్వాసితుల అడ్డగింత

- ఎంపీ, ఎమ్మెల్యేతో వాగ్వాదం

జడ్చర్ల, సెప్టెంబర్ 25 : ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు వాసులు నిరసన తెలిపారు. బుధవారం రిజర్వాయర్ పనుల పరిశీలనకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి తోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వచ్చారు. వీరికి తమ గోడు వెల్ల బోసుకునేం దుకు వెళ్తున్న నిర్వాసితులను అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేస్తారని అనుకుంటే మధ్యలోనే ఎంపీ, ఎమ్మెల్యే, పోలీసులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం..

ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కు మల్‌రెడ్డి అన్నారు. వెనుక బడిన జిల్లాను సస్యశ్యామలం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఉదం డాపుల్ రిజర్వాయర్ పనులను మంత్రి జూపల్లి, నీటి పారుదల శాఖఅధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అంతకు ముయు వల్లూరు-కిష్టారం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పీఆర్ఎల్ఐ పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి రూ.45 కోట్లు విడుదల చేశామన్నారు. ముంపు వాసులకు పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ఉదం డాపుల్ రిజర్వాయర్ పరిధిలోని నాలుగు తండాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేసినం దుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, కలెక్టర్ విజయేందిర బోయి అధికారులు పాల్గొన్నారు.

అన్నీ సమకూరితేనే అదనపు రిజర్వాయర్

గట్టు/కేటీదొడ్డి, సెప్టెంబర్ 25 : అన్ని సమకూరితేనే అదనపు రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంత్రి జూపల్లితో కలిసి ఆయన కేటీదొడ్డి మండలంలోని సోమనాద్రి రిజర్వాయర్(గట్టు ఎత్తిపోతల) ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. హెలికాప్టర్‌లో చేరుకున్న ఆయనకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సరిత స్వాగతం పలికారు. గట్టు ఎత్తిపోతల నమూనాలను పరిశీలించాక సమావేశంలో మాట్లాడారు. వరద నీటిని వృథా చేయకుండా నీటిని స్టోరేజీ చేసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తూ అదనపు రిజర్వాయర్ నిర్మాణానికి ప్రయత్నిస్తోందన్నారు. అయితే దీనికి నిధులు, నీటిలభ్యత మొదలగునవి అవసరమని గుర్తు చేశారు. ఇరిగేషన్ పరంగా ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ నీటిలభ్యత ఉన్నా వాడుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంతో సయోధ్యతో మెలిగి 15 టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తే రెండు రాష్ట్రాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. కాగా ఏదేదో ఊహించుకున్న ప్రజలకు మాత్రం పర్యటన ఉసూరుమనిపించింది. కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఈఎన్‌సీ అనిల్, అదనపు కలెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాసరావు, ఆర్డీవో రాంచందర్, ఇరిగేషన్ ఈఈ రహీ మొయ్దీన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పునరావాస సమస్యలు పరిష్కరిస్తాం

వనపర్తి, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. అలాగే భీమా ప్రాజెక్టులోని శంకరసముద్రం పునరావాస సమస్యను పరిష్కరిస్తామని, వారం రోజుల్లో పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం మరో మంత్రి జూపల్లి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి శంకరసముద్రం రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. శంకరసముద్రం రిజర్వాయర్ నుంచి లక్ష ఎకరాలకు సాగునీరు అందించుచ్చని మంత్రి జూపల్లి అన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలపైనే ప్రతాపం..

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన బడా బాబుల నిర్మాణాలను కూల్చివేయకుండా.. సామాన్యులు, నిరుపేదలు నిర్మించుకునే ఇండ్లను కూల్చివేసేందుకు ప్రణాళికలు రచిస్తుండటం పాల మూరులో వివాదాస్పదంగా మారింది. బిల్డర్లు, డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన తప్పిదాలకు సామాన్యులను బలిచేస్తున్నారని కొందరు వాపోతున్నారు. ఎన్నో ఏండ్ల కిందట ఇతరుల నుంచి భూములు కొనుక్కుని ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి గూడు కట్టుకుంటే.. ఇన్నాళ్లు కిమ్మనని అధికారులు గతంలో వారే ఆయా ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించడం, విద్యుత్ మీటర్లు బిగించడం, పన్నులు వసూలు చేయడం వంటి వాటన్నింటినీ అధికారికంగా చేపట్టిన అధికారులు ఇప్పుడు అనుమతులు లేవంటూ.. నాలా ఆక్రమించారంటూ.. బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయంటూ నీటిపారుదల శాఖ అనుమతులు, ఎన్‌వోసీ, ఇతర విలువైన డాక్యుమెంట్లు లేవంటూ సవాలక్ష మెలికలు పెడుతుండటం నిరుపేదల గుండెలపై పిడుగు పడ్డట్లు అవుతోంది. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మల్లమ్మకుంట, పెద్దచెరువు, ఎర్రకుంట, ఇమాంసాబ్‌కుంట, పాల కొండ పెద్దచెరువు, ఊరచెరువు, బోడోనికుంట తదితర చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా, ఇతర ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇండ్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఆయా ఇండ్లకు సైతం త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నీటిపారుదలశాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వే ఆధారంగా చెరువులు, కుంటలు, నాలాలు, ఆయకట్టు ప్రాంతాల్లో ఇండ్లను నిర్మించుకున్న 70మందికి నోటీసులు జారీ చేసినట్లు మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండే ఇండ్లకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తున్నామని అందులో భాగంగానే ఆయా ఇండ్ల యజమానుల వద్ద ఇంటి నిర్మాణాలకు సంబంధించిన నీటిపారుదల శాఖ ఇచ్చిన ఎన్‌వోసీ, మున్సిపల్ అనుమతులు, తదితర డాక్యుమెంట్లు వారం రోజుల్లో సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ మైత్రినగర్‌లో ఇంటి గేటుకు నోటీసు అతికిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నోటీసుల హడల్

- పాల మూరులో పేదల ఇండ్లకు నోటీసులు
- పెద్ద చెరువు నాలా కబ్జా చేశారంటూ 70 మంది ఇండ్ల యజమానులకు జారీ
- చాప కింద నీరులా పావులు కదుపుతున్న అధికారులు

ఇండ్ల యజమానులకు నోటీసులిచ్చి సంతకాలు సేకరిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 25 : పాల మూరులో పేదల ఇండ్లకు త్వరలో నోటీసులు అందనున్నాయనే విషయం తెలియడంతో నిరుపేదల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పెద్ద చెరువు నాలా పరిధిలో ఇండ్ల నిర్మాణాలు ఉన్నాయనే పేరుతో అధికారులు నోటీసులు జారీ చేయడం కలకలం రేపుతోంది. బడాబాబులపై కన్నెత్తి కూడా చూడని అధికారులు అధికార వర్గం అండదండలు ఉండే పెద్దల నిర్మాణాల విషయంలో మాత్రం అచితూచి అడుగులు వేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే సర్వే నెంబరు 523లో దివ్యాంగుల ఇండ్లను అర్ధరాత్రి కూల్చివేసిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు వారికి పునరావాసం కల్పించలేదు. ఇప్పుడు కొత్తగా పెద్ద చెరువు నాలా ఆక్రమణల పేరుతో నోటీసులు జారీ చేయడంతో నిరుపేదలు ఆగం అవుతున్నారు. పాలమూరులో పెద్దచెరువు పరిధిలో ఆక్రమణలు వదిలేసి.. ఎఫ్‌టీఎల్ పరిధి పూర్తిస్థాయిలో నిర్ధారించకుండా.. మైత్రీనగర్, బాలానగర్ ప్రాంతాల్లో పెద్దచెరువు నాలా ఆక్రమణల పేరుతో నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకే కూల్చివేతల ప్రణాళికలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహబూబ్‌నగర్ మున్సిపల్ అధికారులు ఎలాంటి హడావుడి లేకుండానే పావులు కదుపుతుండడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

పిన్నెంచెర్ల గేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బస్సులు ఆపాలి

- పిన్నెంచర్ల స్టేజీ వద్ద విద్యార్థుల రాస్తారోకో

ఆత్మకూరు, సెప్టెంబర్ 25 : బస్సులు ఆపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మండలంలోని పిన్నెంచర్ల గేటు వద్ద బుధవారం విద్యార్థులు, మహిళలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ప్రయాణాలు ఇబ్బందికరంగా మారాయన్నారు. బస్సు డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ స్టేజీల వద్ద బస్సులు నిలపకుండా వెళ్లి పోతున్నారన్నారు. మహిళలు, విద్యార్థులు స్టేజీల వద్ద నిలబడ్డ ఆపడం లేదన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీహరికి తెలిపినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆరోపించారు. రాస్తారోకోతో రాకపోకలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న సీఐ శివకుమార్ అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరడంతో మహబూబ్‌నగర్ డిపో మేనేజర్‌తో బస్సులు ఆపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు మనోహర్ గౌడ్, గ్రామస్తులు అశోక్‌భూపాల్, కరుణాకర్ గౌడ్, అశోక్‌నంద, శివశంకర్, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఎగువ నుంచి కృష్ణమ్మ పరుగులు

- జూరాలలో ఏడు గేట్లు ఎత్తివేత

గద్వాల, సెప్టెంబర్ 25 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతుంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 72 వేల కూసెక్కులు చేరుతుండగా ఏడు గేట్లు ఎత్తినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 318.350 మీటర్లు, పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 9.316 టీఎంసీలు ఉన్నది. అదేవిధంగా ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 550, భీమా ఫేజ్-1కు 650, ఆర్డీఎస్ లింక్ కెనాలకు 50, విద్యుత్ ఉత్పత్తికి 37,715, మొత్తం 90,161 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.

ఆర్డీఎస్, టీబీ డ్యాంకు స్వల్ప వరద

అయిజ, సెప్టెంబర్ 25 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఆర్డీఎస్‌కు ఇన్‌ఫ్లో 9,310, అవుట్ ఫ్లో 8,700 క్యూసెక్కులు నమోదైంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. అలాగే తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 7,350, అవుట్‌ఫ్లో 10,119 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 101.226 టీఎంసీల నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గానూ 1631.86 అడుగులు ఉన్నది.

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు..

ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 15,002 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 12,144 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకుగానూ 1704.72 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటినిల్వ 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 13,332, అవుట్ ఫ్లో 14,307క్యూసెక్కులు నమోదైంది. గరిష్ఠ నీటి మట్టం 1615అడుగులకు గానూ ప్రస్తుతం 1614.93 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.59 టీఎంసీలు ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కోయిల్‌సాగర్ రెండు గేట్ల ఎత్తివేత

దేవరకద్ర, సెప్టెంబర్ 25 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద చేరుతున్నది. దీంతో బుధవారం ప్రాజెక్టు వద్ద రెండు గేట్లు ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని ఊకచెట్టు వాగులోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ 32.5 అడుగులు ఉన్నది. ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుండడంతో సందర్శకుల తాకిడి పెరిగింది.

గడువులోగా సీఎంఆర్ సేకరిస్తాం

- పౌర సరఫరాల సంస్థ పాలమూరు జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ విక్రమ్

మాట్లాడుతున్న విక్రమ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 25 : సీఎంఆర్ బియ్యం నిర్ధేశిత గడువులోగా సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ టి.విక్రమ్ తెలిపారు. ఈ నెల 24న 'నమస్తే తెలంగాణ'లో పాల మూరులో రూ.9కోట్ల ధాన్యం స్వాహా? 2023-24మాన్‌సూన్ సీజన్‌కు సంబంధించి గడువులోగా సీఎంఆర్ సేకరణ ప్రశ్నార్థకమే..? అంటూ 'మిల్లర్ల మాయ!' అనే శీర్షికన ప్రచురిత మైన కథనానికి ఇన్‌చార్జి డీఎం స్పందించారు. 2023-24 వానకాలం సీజన్‌కు గానూ 86శాతం, యాసంగి సీజన్‌కు గానూ 50శాతం సీఎంఆర్ సేకరణ పూర్తయ్యిందన్నారు. 2023-24 వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి నిర్ధేశిత గడువు ఈ నెల 30వ తేదీలోగా మిగిలిన సీఎంఆర్ బియ్యం వేగవంతంగా సేకరణ చేపడతామని తెలిపారు. 2022-23 సీజన్‌కు సంబంధించి మహబూబ్‌నగర్ అల్లీపుర్ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఇండస్ట్రీస్ రైస్ మిల్లర్ 3002.412 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ.9.44కోట్లు పక్కదారి పట్టించడంపై జూలై 12న క్రిమినల్ కేసు (ఎఫ్ఐఆర్ నం.412/2024) నమోదు చేశామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ఆర్ఆర్ యాక్ట్ అమలు పర్చనున్నట్లు వెల్లడించారు.

కానిస్టేబుల్ అదృశ్యం

- నాలుగు బృందాలతో గాలింపు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 25 : వనపర్తి జిల్లాలోని పాన్‌గల్ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ రామకృష్ణ అదృశ్యం కలకలం రేపింది. మంగళవారం రాత్రి నుంచి కానిస్టేబుల్ రామకృష్ణ కనిపించకుండా పోయాడని పాన్‌గల్ పీఎస్ నుంచి ఎస్కార్ట్ పీసీగా చివరిసారిగా విధులు నిర్వర్తించారని, ఆ తర్వాత జాడ లేకుండా పోవడంతో అతని భార్య వనపర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆర్థిక ఇబ్బందులతో విధులు నిర్వహించలేకపోతున్నానని, తన భార్య మంజులకు మెసేజ్ పెట్టి ఇంటి నుంచి వెళ్లి పోయాడన్నారు. రామకృష్ణ ఎక్కడికి వెళ్లాడనే దానిపై పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అదనపు ఎస్పీ రామ దాస్ తేజావత్ చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతో అతని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని ఏఎస్పీ తెలిపారు.

ఇటిక్యాల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న సాతర్ల వాగు, షేక్‌పల్లి పెద్దవాగు దాటేందుకు ఇబ్బంది పడుతున్న వాహనదారుడు, మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్య బ్రిడ్జిపై పారుతున్న వరద

దంచికొట్టిన వాన

- జోగుళాంబ గద్వాల జిల్లాలో వర్షం
- ఉధృతంగా పారిన వాగులు, వంకలు

ఇటిక్యాల/ఎర్రవల్లి చౌరస్తా/మానవపాడు, సెప్టెంబర్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లాలో వర్షం దంచికొట్టింది. రెండ్రోజులుగా కురుస్తున్న వానలకు తోడు నేడు పడడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని ఊరచెరువు అలుగు పారడం.. సాతర్ల వాగు ఉధృతంగా పారింది. అలాగే ఎర్రవల్లి మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో నీరంతా పంటపొలాల్లోకి చేరి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గార్లపాడు, షేక్‌పల్లి, వల్లూరు పెద్ద వాగులు పొంగాయి. అధికారులు స్పందించి వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటిక్యాల-మానవపాడు పెద్దవాగు పరిసరాల్లో రాత్రి కురిసిన వర్షంతో పెద్దవాగు ఉప్పొంగింది. మానవపాడు- అమరవాయి, మానవపాడు-గోకులపాడు గ్రామాల మధ్యన ఉన్న వాగు ఉధృతంగా పారాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి

బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన పోలీసులు

బీఆర్ఎస్ శ్రేణుల నిర్బంధం

- మంత్రుల పర్యటన నేపథ్యంలో అరెస్టు
- తమను అడ్డుకోవడం ఏమిటని నిలదీత

కేటీదొడ్డి, సెప్టెంబర్ 25 : మండలంలోని నల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పనులను పరిశీలించడానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి రాగా.. సమస్యలు తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు మోనేశ్, శేఖర్‌నాయుడు, తిరుమల్, రాము, బాసు గోపాల్, రాయపురం వీరేశ్, హమోద్, మజ్జు, సామెల్, రవి, సురేశ్, కామేశ్‌ను పోలీసులు నిర్బంధించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన నేతలు ప్రజల సమస్యలు వివరించడానికి వస్తే తమను అరెస్టు చేయడం సమంజసం కాదని జిల్లా నాయకులు బాసు హనుమంతునాయుడు, కుర్వ పల్లయ్య అన్నారు. నిర్బంధాలతో ప్రజాపాలన ఎలా చేస్తారని నిలదీశారు. అంతర్రాష్ట్ర ప్రాజెక్ట్ పేరుతో తెలంగాణ నుంచి కర్ణాటకకు నీళ్లు తీసుకెళ్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆందోళనలు చేపడుతామన్నారు. తక్షణమే రైతుల అకౌంట్లలో రైతు భరోసా జమ చేయాలని, అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.